# మూగనోము ★

.. రచన: వెంకటేశ్వరరావు ..

అది వెన్నెలరాత్రి. ఎంతో ప్రశాంతంగా వుంది. చల్లని పిల్లవాయువులతో కలసి మేళవిస్తూ అప్పటికప్పుడే పొద్దుపోవడంచేత యెక్కడా అలికిడిలేదు. జనసమ్మర్దంగల వీధులు కూడా నిద్రాదేవి ఒడిలో జోగి, కునికిపాట్లు తీస్తున్నై! పరాధీనతలోనున్న నేనంతవరకెట్లో కాలం గడిపి, యెప్పుడు వచ్చి యింట్లోపడుదునా యని, గబ గబా యింటివేపు నడుస్తున్నాను. నడుస్తున్నప్పుడు నా జోళ్ళచప్పుడుతప్ప మరేశబ్దమూ నా చెవుల్లో సోకడంలేదు.

దారిపొడుగునా నాకు ఒకటే ఆలోచన! ఇంటివద్ద చిట్టి వంటరిగావుందనీ, యెప్పుడూ ఆలస్యం చెయ్యనివాడి నీనాడు అంత పొద్దుపొయ్యేదాకా యింటికి చేరనందు కావిడ యేమి అపోహపడుతుందో ననీ—ఆ ఆలోచనాపరంపరలలో మునిగి తేలుతూ వచ్చి మా వాకిట్లో నిలబడి తలుపుతట్టేను.

చాలాసేపటివరకు చిట్టిపలకలేదు. లోపల వుందా? లేదా? అన్న అనుమానం కూడా కలిగింది.

"లేక యేమౌతుంది? నిద్రమత్తులో వుండి యుండాలి!" అని మరింత గట్టిగా "చిట్టీ! చిట్టీ!" అని పిలిచేను.

ఊహుఁ—మెలకువ వస్తేనా? మెలకువ వచ్చినా లేచివచ్చి తలుపుతీస్తేనా?

అల్లాగే యింకా కొంచెంసేపు నిలబడి మళ్ళీ తలుపు గట్టిగా తట్టేను. ఇంతలో దీపపు వెలుతురు తలుపుసందుల్లోంచి మినుకుమినుకు మంటూ అగుపించింది.

"ఓహో! ఇంట్లోవుండే పలకడంలేదు. ఈవేళ నేనింత ఆలస్యంగా వచ్చేనని కోపగించలేదు కదా?" అనుకుంటూ తిరిగి తలుపు దబదబా మోగించేను.

మరో క్షణానికి చిట్టి తలుపు తీసింది. తలుపు తీసేతియ్యడం తరువాయిగా, ఆవిడ నా మొహంవేపేనా చూడకుండా గుభుక్కున పడకగదిలోకి వెళ్ళిపోయింది.

"నే ననుకున్నంతా జరిగింది. చిట్టికి నిజంగానే కోపం వచ్చింది. ఏమి చెయ్యను? నా వల్ల లోటేమీ లేదు! ఈ యలుకకు కారణం లేదు" అని ఆఫీసుడ్రస్సు వగయిరాలు తీసి అల్లాగే కుర్చీలో కాస్సేపు చదికిలపడ్డాను. ఎంతసేపటికీ చిట్టి యివతలకి రాదు! నాకు కావలసిన సదుపాయాలేమీ కనుకోదు.

అప్పటికింకా మాకు "పిల్లా — జెల్లా" లేని కారణంచేత, మాయిద్దరి మధ్యా రాయబారాలు నడిపేవాళ్ళుకాని, యింకోవిధంగా కాలక్షేపంచేసేవాళ్లు గాని మరెవ్వరూ లేరు. నేను మాట్లాడినా ఆవిడతోటే! ఆవిడ మాట్లాడినా నాతోటే! ఒకరిమీద బకరికి కోపంవస్తే యిక చెప్పేది లేదు! ఎవరిదారి వాళ్ళదే! తిరిగి ఆకోపం దానంతట అదే చల్లారి దారికి రావడానికి చచ్చినంత పనవుతుంది. అప్పటిదాకా అంతే!

గోడగడియారం "టంగ్—టంగ్"మని పన్నెండు గంటలు కొట్టింది. అర్ధరాత్రి! వేళ తప్పడంచేత నిద్రకూడా రావడంలేదు. పగలంతా డ్యూటీ చేసి యింటికి రావడం మూలాన్ని, ఒళ్ళంతా అదోవిధంగా విరగగొట్టినట్లుంది. ఇంటికి రావడంతోటే, ఇంటావిడ కళకళలాడుతూ యెదురుగా వచ్చి బడలిక వుపశమించే పరిచారాలేమైనా చేసిందా అంటే, అవేమీ లేవాయె! పైగా, ఆవిడ మూతిముడుచుకొని మాట్లాడ్డంకూడా మానేసిందాయెను. ఇంక యెల్లాగు బడలిక తీర్గడము? నిద్రపట్టడమూను—ఇంక నాకారాత్రి శివరాత్రి జాగరణమేమో ననిపించింది.

ప్రొద్దుపోవడంచేత, యింక నాకారాత్రి భోజనమాశలేదు. టేబిలుమీద నాకోసం వుంచబడ్డ ఫ్లాస్కులోని వేడిపాలతో కడుపు నింపేశేసరికి కొంతసేద తీరింది. కాని మామూలుప్రకారం చిట్టి నాకెదురుగా వచ్చి కిలకిలా నవ్వుతూ తన వాగమృతం నన్ను గ్రోలనివ్వలేదనే కొరత అట్టేవుండిపోయింది. ఏమిటి కర్తవ్యం? చిట్టికింకా చిన్నవయస్సు! సమయా సమయాల్నిబట్టి నడుచుకునే నిపుణత్వం యింకా పూర్తిగా అలవరచుకున్నట్లు అగుపించదు. ఇంతకూ నేను చేసిన తప్పేమిటి? రోజూ యింటికి వేళకు వచ్చేవాడిని, ఒకనాడు పనితొందరవల్ల ఆలస్యం కాకూడదూ? ఇంతమాత్రానికే ఆవిడమూతి ముడుచుకోవాలీ? పోనీ! ఈనాడింత ఆలస్యమైందేమని అడిగి తెలుసుకోవచ్చునే! ఇంతమాత్రానికే నోటిముత్యాలు రాలిపోతవి కాబోలు? అయినా, యీ ఆడవాళ్ళకిదో దుర్బుద్ధి! మాటిమాటికీ అలగడమూ! మూతిముడుచుకోవడమూ! మూడంకెవేసి బిగదీసుకొని పరుండడమూను! అయినా చూద్దాం! ఏం జరుగుతుందో చివరకి—ఆవిడ మూగనోముపట్టింది కదా? నేనూ మౌనవ్రతంపట్టాను. చివరికెవరు గెలుస్తారో? అని నిర్ధారణచేసుకుని మిగతా కాలకృత్యాలు తీర్చుకుని పడకగదిలో ప్రవేశించి నా మంచంమీద నేను పరుండి కొంగ జపంచెయ్యడం మొదలుపెట్టేను.

గోడగడియారం ఒంటి గంట కొట్టింది. చిట్టి అటువేపు తిరిగి పరున్నదల్లా నావేపు తిరిగి ఓమాటు చూచి తిరిగి కళ్ళుమూసుకుంది.

మరికొంచెంసేపటికి "ఆ" అని ఆవిలింత, ఇంక కొంచెంసేపటికి దగ్గుత్తికగా గుఫ్—గుఫ్"మని వచ్చీ రాని దగ్గు.

చివరకి లేచి అటూ యిటూ తిరిగి టేబిలుమీది ఫ్లాస్కు కాళీచేసి వుంచడం చూచివచ్చి తిరిగి పడుకుంది.

నేను కదలనైనా కదలలేదు. పడుకున్నవాడిని పడుకున్నట్లే వున్నాను. ఆవిడ మాట్లాడించలేదని నేనూ, నేను మాట్లాడించలేదని ఆవిడా యెవళ్ళంమట్టుకు వాళ్ళం గపిచిప్.

గోడగడియారం తిరిగి రెండు గంటలు కొట్టింది.

చంద్రబింబం ఆకాశంమీద దిగిపోతూ ఓమాటు మాకేసి కిటికీలోంచి తొంగి చూచింది.

వెంటనే చల్లనిపిల్ల తెమ్మెరవీచింది.

పిల్ల తెమ్మెరతోబాటు, చిట్టి జెడలోని మల్లెపూలు ఘుమ్మని పరిమళించినయి.

కాని మాకిద్దరికీమధ్య చిట్టి పట్టిన మూగ నోము తెరక్రింద అట్టేవుండిపోయింది. ఎంత సేపు మే మా విధంగా కాలక్షేపంచేశేమో, మాకెప్పుడు నిద్రపట్టిందో తెలీదు. క్షణంలో భళ్లున తెల్లవారినట్లయింది. ప్రశాంతంగావున్న వీధులన్నీ ఒక్కమారుగా తిరిగి గుబ్బురు మన్నవి. చిట్టి మామూలుగా లేచి తన పను లన్నీ యథావిధిగా నెరవేర్చుకొంటోంది. అప్పటికప్పుడే మా జవానువచ్చి నాకోసం కాచుకుని కూచున్నాడు. లేచీ లేవడంతో కాలకృత్యాలు నెరవేర్చుకుని నా డ్యూటీ మీద నేను వెళ్ళిపొయ్యేను. ఆ హడావిడిలో చిట్టి పట్టిన మూగనోముకు అవుపోసన అయి నదో, లేదో తెలిసికోలేకపొయ్యేను.

*　　*　　*

ఆరోజు సాయంత్రం మామూలుగా వేళకు యింటికి వచ్చేను. చిట్టి మొగ మింతచేసుకుని యెదురుగా నిలబడివుంది.

“ఓహో! ఈరోజు చిట్టి మంచి హుషారుగా వుందే! కారణం నేను యింటికి పెందరాళే రావడం అయివుండవచ్చు. మగవాళ్లు, ఆడవాళ్ళ నెంత అదుపులో వుంచాలని ప్రయత్నంచేస్తారో, ఆడాళ్ళుకూడా మగాళ్ళను తమ చెప్పుచేతల్లో వుంచుకోవడానికి ప్రయత్నం చెయ్యడం సహజం కాబోలు” ననిపించింది అప్పుడావిడ వైఖరి చూస్తే.



“ఏమండీ? నిన్నటి జరూరుపని యీరోజు లేదు కాబోలు? ఈరోజు పెందరాళే దయ చేశేరు యింటికి” అంది చిలిపిగా నేను గుమ్మంమెట్లెక్కి లోనికి అడుగులువేస్తుంటే.

“నిన్నటిరోజు జరూరుపనివుందని యెవరు చెప్పేరు?” అన్నాను ఆశ్చర్యం అభినయిస్తు.

“ఆ! మద్రాసునుండి యెవరో ఆఫీసరు గారు వచ్చేరుట కదా! అందుమూలంగా రాత్రి ప్రొద్దుపోయిందని మన జవాను నరసయ్య చెప్పేడు లెండి!” అంది.

“ఓహో! నేను రాత్రి ఆలస్యంగా యింటికి రావడానికి కారణం చిట్టి తెలుసుకుంది” అనుకొని “ఔను, నిన్న మాఆఫీసరు గారు వచ్చేరు. అంతమాత్రానికే నువ్వు కోపగించావేం” అన్నాను.

“నాకోపానికేమి లెండి! నాది మామూలు కోపమే!”

“అంటే”

“అంటే ఏమీ లేదు. మీలాంటి యువక శిఖామణులు అంత పొద్దుపొయ్యేదాకా అక్కడక్కడ తిరగడం మంచిది కాదని”

“అవసరంకొద్దీ తిరగవచ్చునుగాని అనవసరంగా తిరగకూడదేమో!”

“అవసరంలేదు! ఛే అవసరం లేదు! చాల్లెండి!” అని మూతి తిప్పుకుంది అదో విధంగా.

అప్పుడావిడ మాటలలో అధికారం తొణికిసలాడింది. చిట్టికి నాపైగల అధికారానికి కొంచెం నవ్వువచ్చి,

“ఊహుఁ—అల్లాగా” అన్నాను.

“కాదా మరి!” అంది తిరిగి మూరు నవ్వు నవ్వుతూ.

*　　*　　*

అంతే! అప్పటికా సంభాషణకు స్వస్తి! రాత్రి యే డెనిమిది గంట లవుతూ వుంది. వీధిలో పెద్దగొడవ! ఆగొడవకు కారణమేమి ?అని వీధి తలుపు తెరచి మేముభయులమూ చూడబొయ్యేము.

“ఇంకేముంది? మామూలు గొడవే! మన ప్రక్కింటి నరసింగరావు సానికొంపకు కాబోలు పోతూంటే, అతడి భార్యా సుభద్రమ్మ అడ్డుపెట్టడమూ, అందుపై అతడామెను చావమోదడమూను” అంది చిట్టి అదోవిధంగా చేతులు రెండూ చప్పుడు కాకుండా కలుపుతూ.

నరసింగరావు అల్లాంటిమనిషి అని నాకది వరలో తెలీదు. ఇరుగు పొరుగవడంమూలాన్ని చిట్టికి తెలుసు వాళ్ళ సంసారంలోని గుట్టు! అది కాస్తా అప్పుడు బయటపెట్టింది నాకు తెలిసేలాగు. క్షణంలో ఆగొడవ చల్లారి పోయింది తాటాకు మంటలాగు యెవరి “జోలీ—శొంటీ” అక్కర లేకుండానే.

“సరి! సరి! అదా సంగతి! పాపమా సుభద్రమ్మకు తెలియదు కాబోలు యిల్లాంటి విషయాల్లో మూగనోము బాగా పనిచేస్తుందని. నువ్వైనా చెప్పలేకపోయినావా?” అన్నాను చిట్టి మొహంలో మొహంపెట్టి చూస్తూ.

మూగనోమేంచేస్తుందండీ! బుద్ధిమంచిదై వుండాలి కాని!” అంది.

“అహ! యెవరి బుద్ధి మంచిదై వుండాలంటావింతకూ.”

“ఒహరిదేమిటి? ఇద్దరిదీని!”

“పాపం సుభద్రమ్మ ఏమిచేసిందిప్పుడు?”

“ఏదో తగూపెట్టుకొని వుండాలి! లేకపోతె యీ రాద్ధాంత మెందుకు? ఈశోకాందాలు దేనికి?”

“అందుకే నేనూ అంటోంది మూగనోము మంచిదని”

చిట్టి తలవంచి “ఔను! ఆడవాళ్ళ కదే రక్ష!” అంది హీనంగా తన కాలిబొటన వ్రేలు నేలకేసి రాస్తూ.

నాకావిడ మాటలోని సారస్యం అర్థం కాకపోలేదు. “నిజము కూడా అంతే! గడచినరాత్రి నామీద లేనిపోని అపోహాలు పెట్టుకొని చిట్టి రాద్ధాంత సిద్ధాంతాల్లోకి దిగితే అప్పుడు మా సంసార మేమిగాను? ఆ విధంగా లోకంలో యెన్ని సంసారాలు మంటగలియడం లేదు?” అనిపించింది.

ఆ వెంటనే చిట్టి తల పైకెత్తి “ఇంతకూ మన బంగారం మంచిదై వుండాలి గాని కంసాలి యేమిచేస్తాడు చెప్పండి!” అంది ఛలోక్తిగా.

“అహ! అయితే మన బంగారం మంచిదే నన్నమాట!” అని ఒహటికి రెండు మూడు సార్లు రెట్టిస్తు చిట్టి రెండు చెక్కిళ్ళమీదా ఆనంద పరవశత్వంతో ముద్దులవర్షం కురిపించేను.